# 15వ TANA సమావేశాలూ -- నా అభిప్రాయాలు! - SKU

Back Home

ఈ పేజీని పంపండి

TANA సభల గురించిన మైల్ మొదటి సారి వచ్చినప్పుడు అనుకున్నాను డెట్రాయిట్ మనకి దగ్గరే సరదాగా వెళ్తే ఒక పని అయిపోతుందేమో అని. ఒక పని అంటే ఇంతవరకూ TANA గురించి వినటమే కానీ, వెళ్ళింది లేదు. కానీ కొంత మంది రచయితలని రెండేళ్ళ క్రితం డెట్రాయిట్ లో కలిసాను మళ్ళీ వాళ్ళని ఒక సారి కలవచ్చు అని అనిపించింది. పైగా, నేను గత 3,4 ఏళ్ళుగా చూడని సినిమాలు, చదవని పుస్తకాలూ అన్నీ కొనుక్కోవచ్చు అని కూడా ఆలోచన. ఆలోచన కార్యరూపం దాల్చటం మాత్రం మిత్రులు శ్రీ అట్లూరి గారితో మాట్లాడాక. ఆయన తను కూడా వస్తున్నాను అని చెప్పాక, సరేలే కనీసం ఈయన అయినా తెలుసు, సినిమా వాళ్ళు ఎలాగూ వస్తున్నారు తోచకపోవటం అనేది వుండదు లే అని అనుకొని TANA కి రిజిస్టర్ అయ్యాను.

అవటం అయితే అయ్యాను కానీ తీరా శుక్రవారం జూలై నెల మొదటి తారీఖున విమానాశ్రయం లో నా విమానం కోసం ఎదురుచూస్తున్నప్పుడు అసలు ఏం ఊదబొడుద్దామని బయలుదేరానూ? అని నన్ను నేను ప్రశ్నించుకుంటే సమాధానం లేదు! మనం అధాటుగా చేసిన వందల పనుల్లో ఇదొకటి! అంతగా ఏమీ తోచకపోతే, హొటల్ రూమ్ వుంది, దానిలో తిని పడుకుంటే సరి, రిలాక్స్ డ్ వీకెండ్ అనుకొని సంతృప్తి పడితే సరిపోతుంది అని నాకు నేను ధైర్యం చెప్పుకున్నాను.

* * *

నా విమానం గంటన్నర ఆలశ్యం అయింది. దానికి కారణం ముందు రోజు మా విమానం తోలే ఆసామీల విమానం ఆలస్యం గా వచ్చిందిట. వాళ్ళకి తగినంత విశ్రాంతి ఇవ్వటం కోసం మర్నాటి విమానం అంటే, నేను వెళ్తున్న విమానాన్ని కొంచెం వెనక్కి జరిపారు. మనకోసం డెట్రాయిట్ లో ఎర్ర కార్పెట్ పరుచుకొని బుష్ అంకులు వచ్చి వుండే అవకాశం లేదు కనుక సాయంత్రం లోపల ఎప్పుడు వెళ్ళినా మనకి జరిగే ప్రమాదం ఏమీ లెదు! ఆ విధం గా పన్నెండున్నర కి నా విమానం డెట్రాయిట్ నగరం లో దిగింది. B టెర్మినల్ నుండి A కి వచ్చాను. అక్కడ నా check-in baggage ని తీసుకోవాలి. A లో display లో విమానం నెంబరు, దానిలోని వాళ్ళ సామాను వచ్చే బెల్ట్ ల వివరాలు వస్తున్నాయి. దాదాపు ఒక పదిహేను నిమిషాలు చూసాను కానీ నా విమానం అతా పతా లేదు. కొద్దిగా ఖంగారు మొదలైంది. మొన్నటి సారి బాల్టిమోర్ వెళ్ళినప్పుడు కూడా నా సామాను వేరే విమానం ఎక్కించేసారు. అలాంటి చిత్రమే ఈ సారీ చేసినట్టున్నారు అని అనుమానం మొదలైంది. అక్కడ ఎవరినో రిసీవ్ చేసుకోవటానికి కొంత మంది తెలుగు వాళ్ళు వచ్చి వున్నారు. వాళ్ళు TANA తాలూకు అని తెలుస్తోంది. వెళ్ళి పలకరిద్దాం అనుకున్నాను. నా మొఖం లో ఏమాత్రం తెలుగుతనం వుండి వున్నా వాళ్ళు కనీసం ఆసక్తి తో నా వైపు చూసే వారు ఏమో.. అలాంటి సూచనలు లేవు కనుక, నేనే వెళ్ళి పలకరించాను. "మీరు TANA తాలూకా అండీ?" అని! (మరి అంతకంటే ఏమని పలకరిస్తాం చెప్పండి.. మామూలుగా అయితే మీరు తెలుగోళ్ళాండీ అనేదాన్ని ఏమో.. వాళ్ళు పెద్ద పెద్ద గా తెలుగు లో మాట్లాడుకుంటుంటే ఆ అవసరం లేదు కదా?)

"అవునమ్మా ఏంటీ?" అని అడిగారు వాళ్ళలో ఒక పెద్దాయన.

ఊరికే పలకరించాను. కానీ ఆయన "ఏమిటీ?" అని అడిగేసరికి ఏం చెప్పాలో ఖంగారు వేసి, "నా

సామాను మిస్ అయినట్టుండి.. ఏం చెయ్యాలండీ?" అడిగాను. ఏం చెయ్యాలో తెలిసినా.

ఇదెక్కడి తలనొప్పిరా బాబూ అనుకున్నట్టున్నారు. "అక్కడ complaint ఇవ్వండి" అని చటుక్కున పక్క ఆయన వైపు తిరిగి మాట్లాడటం మొదలెట్టారు.

సరే, ఆయన చెప్పిన వైపు లేదు అనుకోండి నా airline వాళ్ళ complaint ఆఫీస్, అది మా ఎదురుగ్గానే వుంది. దానిలోకి వెళ్ళి అక్కడ వున్న పొడవాటి లైను లో ఒక అరగంట నుంచుని, నా వంతు వచ్చాక చెప్పాను.. అక్కడ వున్న screens లో నేను వచ్చిన విమానం వివరాలు కనపడలేదు నా సామాను ఏమైనట్టు? అని.

"అయిదవ నెంబరు బెల్ట్ చూసావా?" అడిగారు అక్కడ ఆయన.

"లేదు, చూసి వస్తాను" అని చెప్పి, వెళ్ళి చూస్తే, నా సామాను అక్కడ నా కోసమే ఎదురు చూస్తూ వుంది.

అది తీసుకొని, నా హోటల్ కి చేరాను.

* * *

ఆకలి కడుపుని కాల్చేస్తోంది. వెళ్ళి, ఎదురుగా వున్న Quiznos Sub లోకి నడిచాను. నా వెనకాలే మా హోటల్ లో దిగినాయనే ఒకాయన రావటం గమనించాను. పలకరిద్దాం అన్నట్టు చిన్న పలకరింపు నవ్వు నవ్వాను లైన్ లో చివర నుంచున్న ఆయన్ని చూసి. ఆయన ప్రతి గా నవ్వినప్పటికీ, నేను నా సరుకులు తీసుకొని వచ్చేసరికి మాయమైపోయారు.

తినేసి హోటల్ కి వచ్చేసరికి మూడయ్యింది. సాయంత్రం నాలుగ్గంటల నుండీ ఏవో కార్యక్రమాలు వున్నాయి. కొంచెం ముందు వెళ్తే, కాస్త నలుగురినీ పరిచయాలు చేసుకోవచ్చు అనుకున్నాను. కానీ, ఆ COBO సెంటర్ కి తీసుకెళ్ళేందుకు వచ్చే బస్సో కారో ఎన్నింటికి వస్తుందో తెలీదు. ఎలివేటర్ లో కనపడిన ఒకాయన్ని అడిగాను .. "క్రింద TANA బాడ్జ్ పెట్టుకొని ఒకాయన కూర్చుని వున్నారు, వెళ్ళి ఆయన్ని కనుక్కోండి" అని చెప్పారు. ఈ ఎలివేటర్ లో ఆయన తనకి ఆ సాయంత్రం అవార్డ్ ఇస్తున్నారు అని చెప్పారు. సరే అని బయట TANA బేడ్జ్ పెట్టుకుని హడవిడి గా వాకీ టాకీ లో మాట్లాడుతున్న ఆయన దగ్గరకి వెళ్ళబోగా నన్ను చూసి ఆయన ఎందుకో పారిపోయారు. ఏంటబ్బా నేను పొరపడ్డానా, లేక ఆయన నన్ను వేరే ఎవరన్నా అనుకున్నారా అని అనుమానం వచ్చింది. మళ్ళీ కొంచెం దగ్గరగా వెళ్ళి "హలో అండీ" అని పలకరించేసరికి ఫైనల్ గా నా వైపు ఒక చూపు చూసి, ఆగి వున్న కారు లోకి ఎక్కి వెళ్ళిపోయారు.

నాకు అర్థం కాలేదు. సాయంత్రం కార్యక్రమానికి కార్యనిర్వాహక కమిటీ లో ఆయన సభ్యుడు అని ఆ రోజు సాయంత్రం చూసాక అర్థం అయింది, వాళ్ళు ఎంత కష్టపడి వుంటారో!

సాయంత్రం నాలుగున్నర వరకూ నా గదిలో శుభ్రం గా నిద్ర పోయి, అయిదు గంటలకల్లా తయారయ్యి క్రిందకి వచ్చాను. అక్కడ బయట పట్టు చీరలలో చాలా మందే కనిపించారు. బయట ఒక కుటుంబం

"నడిచెళ్ళిపోదాం" అని అనుకోవటం విన్నాను. వాళ్ళ దగ్గరకి వెళ్ళి పరిచయం చేసుకొని, వాళ్ళతో కలిసి నడక మొదలెట్టాను.

ఆవిడదీ మా కాకినాడే! భలే ముచ్చటేసేసింది. మా కాకినాడ వాళ్ళని ఇక్కడ కలవటం. ఏవో ముచ్చట్లు చెప్పుకుంటూ ఫంక్షన్ హాల్ దగ్గరకి వచ్చేసరికి అక్కడ లోపల మహాసముద్రం లా జనాలు! Pre-Registeration కే కాక On-site Registration కి కూడా చాంతాడంత లైన్లు! రిజిష్టర్ అవుతూనే ఒక సంచీ దానిలో సావనీర్ ఇచ్చారు. దానిని పుచ్చుకొని అసలు ఏమిటో ఇక్కడ సంగతి చూద్దాం అని హాల్ లో చుట్టూ వున్న స్టాల్స్ తిరగటం మొదలెట్టాను. అక్కడ exhibit area అని వుంది. లోపలికి వెళ్దాం అని చూస్తే, ఆరున్నర కి తెరుస్తారు అని చెప్పారు. ఇంకా టైము వుంది ఒక సారి సావనీర్ లో ఎవరి కథలు వున్నాయో ఒక సారి చూద్దాం అని అనుకుంటూ బయటకి నడుస్తూ ఒకయనకి అడ్డం గా వెళ్ళి "సారీ చూసుకోలేదు" అని పక్కకి తప్పుకున్నాను.

ఆయన తలెత్తి నన్ను ఎగాదిగా చూసి "సూర్యకుమారి.. బాగున్నారా?" అన్నారు.

అలాంటి తెలీని ఊర్లో మనని పేరు పెట్టి ఎవరన్నా పలకరిస్తే కొంచెం ముచ్చటగానే వుంటుంది కదూ, ఎవరా అని కుతూహలం గా ఆయన బేడ్జ్ కోసం చూసాను. అది ఆయన చేతుల్లో వుంది. అయినా దాని అవసరం లేకపోయింది లెండి. గొంతు ని బట్టి ఆయన శ్రీ అట్లూరి గా గుర్తించాను. ఆయన నాకు దాదాపు మూడేళ్ళు గా పరిచయం. కానీ ప్రత్యక్షంగా కలవటం ఇదే మొదటి సారి. ఆయన కబుర్లు సైట్ కి ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు, నచ్చనివి వున్న రోజు నిష్కర్ష గా విమర్శించేవారు. ఆవిధం గా ఒక ఆత్మీయుడు నాకు. ఎవరెవరు వచ్చారు టూకీగా చెప్పారు. "లక్ష్మీ ప్రసన్న వచ్చారు చూసారా?" అడిగారు. లక్ష్మీ ప్రసన్న అంటే సినీ నటుడు మోహన్ బాబు కుమార్తె. "ఇంతకీ Banquet కి నువ్వు రిజిష్టర్ అయ్యావా?" అడిగారు శ్రీ. డెట్రాయిట్ వచ్చే ముందు చెప్పాను నేను Banquet కి రిజిష్టర్ అవలేదు అని. "ఇవాళ ఇంక అదొక్కటే ప్రోగ్రాం మరి దానికి రాకపోతే ఏం చేస్తావ్?" అడిగారు. "ఏముందీ, హోటల్ కి వెళ్ళిపోయి TV లో ఏదో ఒక సినిమా చూస్తాను" చెప్పాను.

"సరే, రేపు పొద్దుటే ఆరింటికే మొదలు కార్యక్రమాలు" చెప్పి శ్రీ, ఆయన మిత్రుడూ శలవు తీసుకున్నారు. సుజనరంజని కిరణ్ ప్రభ గారు, నాకు తెలిసిన లిటరరీ ప్రముఖులు కొంత మందీ వచ్చారని శ్రీ చెప్పారు.

అక్కడ నుండీ రిజిష్ట్రేషన్ కౌంటర్ దగ్గరకి వచ్చేసరికి నా మనసు మారిపోయింది. ఇంత దూరం వచ్చి ఇది మిస్ అవటం ఏమిటీ.. అని అనిపించి, అక్కడ ఒక ఫారం తీసుకొని, Banquet కి ఫిల్ చేసాను. కానీ అక్కడ వున్న ఒకాయన "Banquet టికెట్లు అయిపోయాయి, మీకు మెయిన్ హాల్ లో సీట్ దొరకదు, సేటిలైట్ రూమ్ అని ఒకటి ఏర్పాటు చేస్తున్నారు, దానిలో మీకు కుర్చీలు వేస్తారు, అందులో TV స్క్రీన్స్ మీద లోపల జరుగుతున్న కార్యక్రమం చూడటం" అని చెప్పారు.

ఏం చేద్దాం అని ఆలోచిస్తుండగా, "ఏయ్ సూర్యా.. గుర్తు పట్టావా?" నా ముందుకు సూటూ బూటూ వేసుకున్న ఒక వ్యక్తి వచ్చి అడిగారు. నాకు చూడగానే ఎవరో అర్థం కాలేదు. బాగా పరిచయం వున్న వ్యక్తి లా ఏకవచనం లో పిలుస్తున్నారు ఎవరో బాగా తెలిసిన వ్యక్తే అయి వుంటారు అని తెలుసు కానీ గుర్తు రాక "ఎవరు మీరు?" అని అడిగేసాను డైరెక్ట్ గా. "విసూ" చెప్పారు.

మరొక్క ఆశ్చర్యం! ఆయన కూడా నాకు చాలా ఏళ్ళు గా తెలుసు. టొరాంటో లో మా ఇంటికి సతీ సమేతం గా వచ్చారు కానీ, ఏమిటో గుర్తు పట్టలేకపోయాను. "ఇవాళ నాకు అవార్డ్ ఇస్తున్నారు" చెప్పారు.

"నేను దాని కోసమే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నా, లోపలికి రానీయరుట ఇప్పుడు బుక్ చేసుకున్నా" నిరాశ గా చెప్పాను. ముందు లైన్ పెరుగుతుండటం గమనించి, మళ్ళీ కలుస్తాను అని చెప్పి లైన్ లో నుంచుండగా, నా ముందు ఆయన తన దగ్గర వున్న Banquet టికెట్ రిటర్న్ ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నారు అని తెలిసింది.

ఆయన దగ్గర ఆ టికెట్ కొని, సంతోష పడిపోయాను. ఆయన పేరు ఏమిటో కనుక్కోలేదు లోపల సీట్ దొరికింది అనే ఆనందం లో. అది ఎంత పెద్ద పొరపాటో Banquet హాల్ లో అర్థం అయింది!

* * *

TANA సావనీర్ లో విశేషాలు చూడాలి అని గుర్తుకి వచ్చి, జనాలకి దూరం గా వెళ్ళి చూడటం మొదలెట్టాను. ముందు నాకు తెలీకుండానే నా కథ చదువుకోవటం మొదలెట్టాను. ఒకసారి ఒక ప్రచురణకర్త తో నాకు జరిగిన చేదు అనుభవం ఫలితం అనుకుంటా! ఇంతలో పక్కన టేబుల్ మీద కూర్చున్న కొంత మంది లోంచి ఒక పెద్దాయన వచ్చి, "ఏమండీ మీరు సూర్య కుమారి కదూ?" అని పలకరించారు. ఆయన వేలూరి వెంకటేశ్వర రావు గారు. పలకరింపులు అయ్యాక ఆయన తనతో వున్న వారిని పరిచయం చేసారు. వారు, అఫ్సర్ గారు, వారి సతీమణి కల్పనా రెంటాల. వారి పేర్లు ఎక్కడో విన్న గుర్తు కానీ, నా మతిమరుపు, వెంటనే గుర్తు రాలేదు. అఫ్సర్ గారు చాలా మృదు స్వభావి అనిపించారు. కల్పన గారు చాలా చక్కగా మాట్లాడారు. "నాకు నిడదవోలు మాలతి గారు తెలుసు. ఆమె మీ గురించి చెప్పారు" అన్నారు. ఏం చెప్పారో అడగటం అప్పుడు మర్చిపోయాను.

* * *

Banquet హాలో లోకి అడుగుపెట్టాను. లోపల గుమ్మం దగ్గర ఒక అమ్మాయి అందరినీ పేర్లు అడిగి, తన లిస్ట్ లో ఆ పేరు వెతికి వాళ్ళు కూర్చోవలసిన టేబుల్ నెంబరు చెప్తున్నారు. నా టేబుల్ నెంబరు తెలుసుకోవటానికి నా టికెట్ ఎవరి పేరున కొన్నారో నాకు తెలీదు! అమెని అయోమయం లో పడేసి అక్కడ వచ్చే వాళ్ళకి అడ్డంగా వున్నా ఎమో అని అనుమానం తో పక్కకి జరగబోయేంతలో మళ్ళీ మిత్రులు విశు కనిపించారు. "ఏమిటీ?" అని అడుగుతూ. చెప్పాను, "నేను ఎవరి దగ్గర టికెట్ కొన్నానో తెలీదు, అందువల్ల నా టేబుల్ నెంబర్ తెలీదు" అని. వచ్చి మా టేబుల్ దగ్గర కూర్చో అని చొరవ గా తన తో తీసుకెళ్ళిపోయారు. చూస్తే, అది అవార్డీలకని ప్రత్యేకంగా కేటాయించిన టేబుల్. అక్కడ కూర్చోవటానికి కొంచెం సిగ్గు లాంటిది వేసింది. ఎవరన్నా వచ్చి, "నువ్వేం వుద్ధరించావని ఇక్కడ కూర్చున్నావ్?" అని అడిగితే మొఖం ఎక్కడ పెట్టుకోవాలో తెలీక ఇబ్బంది పడాలి అని సణుగుతుంటే, "అలా ఎవరన్నా అడిగినప్పుడు చూద్దాం లే, అప్పటికి అంతా సీట్లలో సర్దుకుంటారు, ఎక్కడ ఖాళీ వుంటే అక్కడ కూర్చుందువు" అని నోరు మూయించేసారు విసు.

పొద్దుట ఎలివేటర్ లో కనపడిన గణితాచార్యులు శ్రీ సత్యనారాయణ రాజు (mathsminds.com) గారు మళ్ళీ కనిపించారు. అక్కడ వున్న మిగిలిన పురస్కార విజేతలకి నేను అక్కడ కూర్చోవటానికి కారణాలు చెప్తే, "పర్లేదు లెండి మీరే మాకు కంపెనీ" అని చెప్పి నాలో ధైర్యం పెంచారు.

ఆ రోజు రాత్రి భోజనం లో అన్నిటిలోనూ ఉప్పు కాస్త ఎక్కువ అయినట్టు అనిపించింది. మాటి మాటికీ మైకు లో ఒకాయన టేబుల్ మీద పెట్టిన సెంటర్ పీస్ లు ఇంటికి తీసుకుపోకండి అని చెప్తున్నారు. దానికి కారణం, మర్నాటి భోజన కార్యక్రమాలలో కూడా వాటినే వాడాలిట. ఒక వేళ వాడకపోయినా, వాటిని ఎవరు తీసుకొని పోతారో నాకు అర్ధం కాలేదు!

విశు తనకి అవార్డ్ ఇస్తుండగా ఫోటోలు తీయమని కోరారు. ఆయన పుణ్యమా అని సత్యం కంప్యూటర్స్ రామలింగ రాజు గారు, కొంత మంది రాజకీయ నాయకులూ, నాయకురాళ్ళనీ దగ్గర నుండి చూసి, మాట్లాడే అవకాశం దొరికింది. భోజనాలు ముగిసే సమయం లో మా వెనుక చిన్న కలకలం మొదలైంది. చూస్తే, సినీ నటి లయ! నేను గబ గబా బేగ్ లోంచి కెమెరా తీసి ఫోటో క్లిక్కబోతుండగా పక్కనే వున్న విసు స్నేహితుడు ఒకాయన "ఖంగారు పడకండి, మనం వెళ్ళి లయ తో మాట్లాడదాం" అన్నారు. అన్నట్టు గానే, తరువాత లయ గారు అందరికీ ఫోటోల కోసం చిరునవ్వులు చిందిస్తూ (చాలా అలసిపోయినట్టు కనిపిస్తున్నా) వుండగా నన్ను పిలిచి ఆమెతో ఫోటో తీయించుకోమని చెప్పారు. ఆమెని అంత దగ్గర నుండి చూస్తే చాలా పొడవైన అమ్మాయి లా అనిపించారు. ఆమె పక్కన మనం ఎందుకులే, దిష్టి చుక్క లాగ అని నేను మొహమాటం గా వద్దు వద్దు అని ( మళ్ళీ ఆమె వింటే బాధపడతారేమో అని భయం!) అంటున్నా వినకుండా మొత్తానికి ఆమె పక్కన నుంచోపెట్టి ఫోటో తీసుకునేదాకా ఊరుకోలేదు విసు, ఆయన స్నేహితుడూ.

అక్కడ జరిగిన ప్రసంగాలలో ఒకాయన "నేను తెలుగు సినిమా కధానాయిక కన్నా మంచి తెలుగే మాట్లాడుతున్నాను" అని శలవిచ్చారు, దానికి ఒక మిత్రుడి వ్యాఖ్య "ఏం ఇప్పుడు ఈయన వెళ్ళి వాళ్ళకి పోటీ కూర్చుంటారా?"

ఇక్కడ ఒక మాట చెప్పాలి. ఆ మధ్య నేను TANA, ATA ల గురించి ఏదో చురక వేసాను, అవకాశం వచ్చినప్పుడల్లా నాకు తెలిసిన పుకార్లు, విషయాల ద్వారా ఏర్పరుచుకున్న అభిప్రాయం తో ఏవో నాలు మాటలు మాట్లాడేదాన్ని. ఇప్పుడు మరి వేరే సంస్థ కి చెందిన విసు కి TANA వారు అవార్డ్ ఇవ్వటం చూసి, "ఇదేమిటీ? మరి మీ మధ్య ఆ తేడాలూ?" అడిగాను. దానికి విసు, "చా .. చా.. అలాంటివి ఏమీ లేవు. అసలు నన్ను వీళ్ళు ఇలా పిలుస్తారని కూడా ఊహించలేదు" అన్నారు. మరి ఇద్దరు దగ్గర అయే ప్రయత్నాలు చేస్తున్నారో Buttering చేసుకుంటున్నారో లేక నిజంగా నావి అన్నీ అపోహాలేనో! ఏమైనా ఇలా రెండు కులాల ప్రతినిధులు గా ఈ సంస్థలు వున్నన్నాళ్ళూ నా లాంటి వాళ్ళు వుండక మానరు!

తర్వాత మా టొరొంటో బాండ్ AGNI వాళ్ళ సంగీత కార్యక్రమం జరిగింది. అందరూ చిన్న పిల్లలు, వాళ్ళలో చాలా మంది అసలు తెలుగు వాళ్ళే కాదు కానీ చక్కటి ఉచ్చారణ తో పాడారు. మొత్తానికి చక్కని ప్రదర్శన. వాళ్ళు పాడిన / డాన్స్ చేస్న పాటల్లో నాకు నచ్చినవి "వాతాపి గణం" (గానం), మాస్ చిత్రం లోని "మాస్" (గానం, నాట్యం), వర్షం లోని

"నువ్వొస్తానంటే" (గానం). ఇంక భరించలేకపోయిన వాటిల్లో ప్రముఖమైనది శంకరాభరణం చిత్రం లోని "శంకరా" (గానం)

* * *

## Saturday, July 2 2005

పొద్దుటే తయారయ్యి క్రిందకి వచ్చేసరికి బ్రేక్ ఫాస్ట్ హాల్ లో అంతా తెలుగు మయం! కానీ ఆలశ్యం అయిపోతోంది అని ఎవరినీ పలకరించకుండా కాఫీ కూడా తాగకుండా హోటల్ బయటకి వచ్చాను.

హోటల్ బయట నుంచుని వున్న ఒక జంట ని "బస్ ఎన్నింటికి వస్తుందో తెలుసాండీ?" అని అడిగాను. ఆయన దానికి సమాధానం ఇవ్వకుండా "ఏం సూర్యకుమారి గారు బాగున్నారా?" అని అడిగారు.

చూస్తే, ఆయన టొరొంటో లోని పరిచయస్థులు "సదా" అని పిలవబడే సదాశివరావు గారు, ఆయన సతీమణి. కొద్ది సేపు అక్కడ మాట్లాడి, వారికి మళ్ళీ కలుద్దామని చెప్పి, COBO హాల్ వైపు నడక మొదలెట్టాను. దారిలో, UK నుండి వచ్చిన డాక్టర్ దంపతులు పరిచయం అయ్యారు. వారిది ఏలూరుట.

హాల్ లోకి అడుగు పెడుతూనే అంతా COBO Arena లోకి గుంపులుగా పోవటం చూసి నేను కూడ వారి వెంట నడిచాను. లోపల అప్పుడే "స్వాగతాంజలి" మొదలు అవుతోంది. ఆ కార్యక్రమం CD ని రిజిస్ట్రేషన్ పాకెట్ తో పాటు ఇచ్చారు. చిన్న చిన్న పిల్లలూ పెద్దలూ రెండు నెలల పాటు కష్టపడి రూపొందించిన కార్యక్రమం. చాలా చక్కగా వుంది. సంగీతం అవనీయండి, వ్యాఖ్యానం కానీయండి, పిల్లల డాన్స్ లు కానీ, సెట్ లు కానీ, చక్కగా అమరి ఎంతో నచ్చింది నాకు.

ఆ కార్యక్రమం అయ్యాక జరిగిన ఉపన్యాసాలలో నాకు నచ్చినది ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సురేష్ రెడ్డి గారిది. చక్కగా, సూటి గా చెప్పదల్చుకున్నది చెప్పారు. అంతకు ముందు మాట్లాడిన TANA అధ్యక్షుడి పిన్నపాలకి తన వంతు సమాధానాలూ, వాగ్దానాలూ ఇచ్చారు. అన్నట్టు హైదరాబాదు నుండి ముఖ్యమంత్రి గారు సాటిలైట్ TV ద్వారా తమ సందేశం వినిపించారు. వక్త గా రాజశేఖర్ రెడ్డి నాకు అంత నచ్చరు. సురేష్ రెడ్డి గారి తరువాత మాట్లాడిన వక్తలలో రాయపాటి సాంబశివరావు గారు NRI ల (భారత దేశం పట్ల) కర్తవ్యాన్ని చెవులు చిల్లులు పడేలా గుర్తు చేసి చెప్పారు. తర్వాత కేశవరావు గారు. చాలా సార్లు పేపర్లలో ఆయన పేరు చదివాను కానీ ఎందుకో మరి, ఏమీ పెద్దగా మాట్లాడకుండా క్లుప్తంగా కానిచ్చేసారు. చివరగా మాట్లాడిన వారు నన్నపనేని రాజకుమారి గారు. కాంగ్రెస్ నాయకుల మధ్య TDP నుండి ఏకైక (ఇంకా ఎవరో వచ్చారు కానీ ఈవిడంత పేరున్న వక్తలు కాదు అనుకుంటా) ప్రతినిధి. ఆవిడ ప్రసంగం లో సమైక్య ఆంధ్ర, చంద్ర బాబు, NTR లు తప్ప చెప్పుకోవటానికి పెద్దగా ఏమీ లేదు. దానికే శ్రోతలలో చాలా మంది కసి గా చప్పట్లు కొడుతుంటే "ఆహా ఎంత మంది TDP సానుభూతిపరులు!" అనుకొన్నాను. కానీ తర్వాత రోజు వక్తలని ఆపమనటానికి శ్రోతలు అవే చప్పట్లని కొట్టడం చూసి, "నన్నపనేని రాజకుమారికి కొట్టినవి ఏ రకం చప్పట్లో!?" అనే అనుమానం వచ్చింది.

మధ్యాహ్నం భోజనం ఒక్కదాన్నీ చేయటానికి వెళ్తుండగా మురళీ నందుల (sahiti.org) భోజనం చేసి బయటకి వస్తూ కనిపించారు. పలకరించాను "గుర్తు పట్టారా?" అని. ఒక పది నిమిషాల్లో పైన "Youth Telugu Literary Session" మొదలవుతుంది ఆసక్తి వుంటే రమ్మని చెప్పారు. గబ గబా తినేసి వెళ్దాం అని లోపలికి నడిచాను. ఇంకా చాలా రద్దీ గా వుంది భోజనాల దగ్గర. పదార్థాలు అమర్చిన టేబుల్ కి వెళ్ళే లైన్ లో నా వెనుక ఒకావిడ పూర్వకాలం భట్రాజులు వుంటారు చూడండి ఆ చందాన తన వెంట వున్న సినీ నటుడు మోహన్ బాబు గారి కుమార్తె ని ప్రకటిస్తూ వస్తున్నారు. వెనక్కి తిరిగి చూసి లక్ష్మి అనబడే లక్ష్మీ ప్రసన్న ని చూసి, "అమ్మాయి మేకప్ బానే వేసుకున్నారు!" అనుకున్నాను. వారి మాటల సారాంశం $2000 ఖర్చు పెట్టి TANA కి వచ్చారన్నది! ఇలాంటి భట్రాజుల మీద ఏమో! టేబుల్ చుట్టూ వున్న గుంపుల మాటలు వింటూ ఒక్కదాన్నీ భోజనం ముగించి పైన కార్యక్రమానికి పరుగు తీసాను.

లోపలికి అడుగు పెడుతూనే, ఆరి సీతారామయ్య గారు, పారనంది లక్ష్మీ నరసింహం (పాలన) గారూ కనిపించారు. హాల్ లో వున్నది 6,7 మంది అంతే! ముందు వరస లో ఆయన స్వరం బట్టి ఆయన వేలూరి వెంకటేశ్వర రావు గారు అని గుర్తించాను. వీరు ముగ్గురినీ క్రితం సారి డెట్రాయిట్ లో జరిగిన తెలుగు సాహితీ సమావేశాలకి వెళ్ళినప్పుడు పరిచయం. ఆ రోజు వక్తలలో టొరొంటో కి చెందిన అశ్విన్ పిల్లరసెట్టి -- ఈయన వేమన శతకాల గురించి మాట్లాడారు. బానే మాట్లాడారు అనిపించింది. రెండో వక్త సందీప్ బొప్పన -- ఈయన కి చాలా భాషలు వచ్చుట! ఆంగ్లం లో మాట్లాడారు. తెలుగు గురించే కనుక పర్లేదు అని చెప్పారు ఆరి గారు. ఆయన మాట్లాడిన విషయాలలో ప్రముఖం గా నాకు అర్థం అయినది తెలుగు పట్ల వున్న ఆదరణ (లేక నిరాదరణ?). మూడో వక్త పాలన గారి అబ్బాయి (ఈ విషయం కార్యక్రమం మధ్య లో తళుక్కుమని ప్రత్యక్షమైన మిత్రుడు శ్రీ నా చెవి లో ఊదగా తెలిసింది) చిన్నూ అని అక్కడి వారు అందరూ పిలిచే శ్రీనివాస్ పారినంది. ఈయన రంగనాయకమ్మ గారి రామాయణ విషవృక్షం మీద తన విమర్శలూ వ్యాఖ్యలతో కూడిన ప్రసంగం చేసారు. రంగనాయకమ్మ గారి రచనలని నేను గౌరవిస్తానో లేదో తెలీదు కానీ చక్కటి టైం పాస్ గా చదివిన గుర్తు. ఆ విశేషాలు మరొక్క కొత్త కోణం నుండి విన్నాను ఆ అబ్బాయి ప్రసంగం లో. ఆఖరున మాట్లాడిన అమ్మాయి మళ్ళీ కెనడా అమ్మాయి. పేరు రసజ్ఞ. చూడ చక్కగా వుంది ఆ అమ్మాయి కూడా పేరు లానే! నృత్యం చేస్తారుట! దానితో సంతృప్తి పడి వుంటే బాగుండేది. నాకు ఆమె ప్రసంగం ఏమాత్రం ఆసక్తికరం గా అనిపించలేదు. కొన్ని పదాల వుచ్చారణ తప్పు గా వుంటే వినే సహనం నాలో తక్కువ. ఆ లేమి వలన అక్కడ నుండి లేచి వచ్చేసాను.

ఈ మధ్య లో కన్నెగంటి రామారావు గారు ఒకసారి వచ్చి చూసెళ్ళారు. ఈ సభ కి అధ్యక్షులు వేలూరి వెంకటేశ్వర రావు గారు. పాపం ఒక అరడజను పైన పేజీల వ్యాసం రాసుకొని వచ్చారు. ఆయన దాదాపు అయిదో పేజీ దగ్గర వుండగా మరి వేదిక మీద వున్న వక్తల ముఖకళవళికలు గమనించి అనుకుంటా ప్రేక్షకులలో ఒక వ్యక్తి (ఆయన TANA బేడ్జ్ పెట్టుకొని వున్నారు పేరు తెలీదు) వేలూరి వారిని ఉపన్యాసం ముగించమని చాలా నిష్కర్ష గా చెప్పారు. నాకు మనస్సు చివుక్కు మంది. కానీ, మర్నాడు జరిగిన మరొక్క కార్యక్రమం లో అధ్యక్షుడు ఆ సభ లోని వక్తల సమయాన్ని మింగేయటాన్ని చూసి ఈయన, మరికొంత మందీ చమత్కారం గా చెప్పటం చూసి, ముందు రోజు జరిగిన దానికి నేనే మరీ ఫీలినట్టున్నాను కానీ ఇలాంటివి వక్తల ప్రపంచం లో మామూలే కాబోలు లే అని సరిపెట్టుకున్నాను.

ఆ కార్యక్రమం నుండి వాకౌట్ చేసిన నాకు బయట పాణిని గారు కలిసారు. వారి దంపతులు ఇద్దరూ భలే ముచ్చట వేస్తారు నాకు. ముఖ్యం గా అరుణ గారితో మాట్లాడటం నాకు చాలా నచ్చుతుంది. ఆమెని భోజనాల దగ్గర కలిసినప్పుడు చుట్టు రంగు రంగుల చీరలూ డ్రస్ లూ వేసుకున్న అమ్మాయిలని చూస్తూ, "అబ్బా.. ఎంత బాగున్నాయో ఈ డ్రస్ లు అన్నీ, నాకు అన్నీ కావాలనిపిస్తోంది" అనే తెలివితక్కువ మాట ఒకటి అన్నాను. దానికి ఆమె చేసిన వ్యాఖ్య నన్ను కొత్త కోణం లో ఆలోచించేలా చేసింది. "అరుణ గారు రాలేదా?" అని అడిగితే పాణిని గారు, ఎక్కడో కింద వున్నారు అని చెప్పారు. అందరికీ కాఫీ తాగాలన్న కోరిక కలిగి, క్రిందకి నడిచాము. కాఫీ టైము అయిపోయిందేమో అని హడావిడిగా అంతా తిరుగుతుండగా, భోజన శాల బయట ఒకాయన నన్ను అదాటు గా చూసి, మళ్ళీ మరోసారి పరికించి చూడటం గమనించాను. చివరికి ఆయన పలకరించారు "మీరు సూర్యకుమారి, కబుర్లు కదా?"

ఆయన tenugu.org నాగరాజారావు గారు. కబుర్లు సైట్ గురించి ఎన్నో మంచి సూచనలూ సలహాలూ ఇచ్చారు. నేను ఈ మధ్య వాడుతున్న Unicode ఎడిటర్ గురించి చెప్తే, అది ఆయన రూపొందించినదే అని తెలిసి ఎంతో సంతోషపడ్డాను. ఆయన వెంట వున్న వ్యక్తి తమ్మినేని భూషణ్. తరువాత రెండు కార్యక్రమాలలోలో నేను వీళ్ళతోనే గడిపాను. కాఫీ కోసం exhibit area కి వచ్చినప్పుడు అక్కడ వున్న షాపులు అన్నీ ఒక రౌండ్ వేసాను. వాటిల్లో ఒక DVD స్టోర్ లో నా అభిమాన దర్శకులు వంశీ చిత్రాలు కొన్ని దొరికాయి. అవీ, ఈ మధ్య నేను చూడాలనుకొనీ చూడలేకపోయిన కొత్త సినిమాలు కొన్నీ DVD లు కొనుక్కుని వచ్చేసరికి రచ్చబండ యాహూ గ్రూప్ సభ్యులు అంతా ఒక రౌండ్ చైర్ సమావేశం లో కనపడ్డారు. పెళ్ళి వాళ్ళ మధ్య ఇరికాను.

అంతకు ముందు teluguone.com స్టాల్ దగ్గర కూర్చున్న మల్లిక్ గారు కనిపించారు. ఆయన కొత్తగా ఎన్ని రకాల వ్యాపకాలు పెట్టుకున్నప్పటికీ, ఆంధ్రభూమి లో ఆయన రాసిన రత్నాల్లాంటి నవరత్నాలూ, వేసిన కార్టూన్లే గుర్తుకి వస్తాయి. ఆంధ్రభూమి పేరు ఎత్తగానే మల్లిక్ గారి వ్యాఖ్య లు విన్నాక అది ప్రస్తుతం ఆయనకి అంత రుచించని టాపిక్ అని అర్థం అయింది. ఆయనతో మాట్లాడుతూ మరోసారి ఇండియా లో వారపత్రికలు చదవటం ముఖ్యం గా ఆంధ్ర భూమి, స్వాతి, ప్రభ లని చదవటం కళ్ళ ముందు గిర్రున రీళ్ళు తిరిగాయి.

రచ్చబండ జనాల మధ్య కాత్యాయనీ విద్మహే గారు, కాట్రగడ్డ దయానంద్ గారూ వున్నారు. వీరిని కలవటం మొదటి సారి. మాటల మధ్య కన్నెగంటి రామారావు గారు చెప్పారు.. వారి సతీమణి కాకినాడ వారే అని. నేను అత్యుత్సాహం తో networking మొదలెట్టబోయాను కానీ, కుదరలేదు. కల్పన రెంటాల గారితో మరోసారి మాట్లాడే అవకాశం వచ్చింది. అంతకు ముందు పొద్దుట అఫ్సర్ గారు హాల్ లో కనపడి పలకరిస్తే, "మీరు ఎవరండీ?" అని అడిగాను, "నేను అఫ్సర్" అని ఆయన చెప్పగానే చాలా చిన్నతనం అనిపించింది కొద్ది గంటల ముందు పరిచయం అయిన వ్యక్తి ని గుర్తు పెట్టుకోలేని నా అజ్ఞానానికి. చూస్తుండగా అక్కడే ఆరున్నర అయిపోయింది. భోజనాలు గంట సేపే అని ఎవరో అన్నారు. సరేలే అని అందరం అటు వైపు కదిలాము. అక్కడ వున్న లైను చూస్తే, అందరికీ తిరుపతి లో దర్శనం కోసం వుండే లైను గుర్తొచ్చింది. దాని అంతు వెతుక్కుంటూ ఎక్కడికో పోయి నుంచున్నాము. మాతో వున్న భూషణ్, కన్నెగంటి రామారావు గార్లు పద్యాల జుగల్ బందీ మొదలెట్టారు. ముఖ్యం గా భూషణ్ గడ గడా చెప్పే పద్యాలని నేనూ, మిగిలిన వారూ అబ్బురంగా వింటూ వుండిపోయాము. వంటకాలలో ఏమున్నాయో కనిపించనంత రద్దీ. వున్నవాళ్ళలో కొంచెం పొడగరి అయిన రామారావు గారు ముందుకి చూసి వారి సతీమణి తో

"వంకాయ కూర వుంది" అని ప్రకటించారు. దానికి మాచవరం మాధవ్ గారు చమత్కారపూరితమైన వ్యాఖ్య ఒకటి చేసారు!

భోజనాల దగ్గర ఎదురుగా సుప్రసిద్ధ నైపథ్య గాయని పి.సుశీల కనపడ్డారు. ఆమె పక్కన వున్న వాళ్ళందరూ తమిళుల మాదిరి అడ్డ బొట్లు పెట్టుకొని వున్నారు. ముఖ్యం గా సుశీల గారి పక్కన వున్న ఆమె ఎవరో మాకు అర్థం కాలేదు. చాయా దేవి నుండి జిక్కి (ఈమె ఈ మధ్య స్వర్గస్థురాలు అయ్యారు అని గుర్తు వచ్చింది) వరకూ ఎవరై వుంటారా అని తలలు బద్దలు కొట్టుకున్నాం. ఆఖరికి ఆత్రం ఆపుకోలేసి ఒకరు వెళ్ళి ఆమె నటి రాజసులోచన అని కనుక్కొచ్చారు. ఇవాళ telugucinema.com లో చూస్తే ఇంకో కొత్త పేరు జమునా రాణి అని వుంది!

భోజనాలు అయ్యాక నేను భూషణ్, నాగరాజారావు గార్లతో కలిసి Youth Show అంట జరుగుతోంది దానికి వెళ్ళాము. అందులో ఒక నృత్యం లో భారత దేశం, కెనడా, అమెరికా జాతీయ జెండాలతో పిల్లలు నాట్యం చేస్తూ వాటిని నేల మీద పెట్టి దాటుటూ నృత్యం చేయటం చూసి అనిపించింది, ఈ నృత్యం పుణ్యమా అని దాని మీద అడుగు వేస్తారో ఏమిటో అని! అటువంటిది ఏదీ దూరం గా వున్న నా కళ్ళ పడలేదు కానీ, ఒక వేళ అలాంటిది జరిగి వుంటే, అది కేవలం పొరపాటు, లేక ఆ నృత్యానికి దర్శకత్వం చేసిన వారి గ్రహపాటు అయివుంటుంది లెండి!

ముందు రోజు చిన్నపిల్లల కార్యక్రమాలు మెచ్చిన కళ్ళతో ఈ Youth Show ని చూస్తే విరక్తి వచ్చింది. ఆ కార్యక్రమం లో నాకు నచ్చినది ఒక్కటీ లేదు. ఆ.. ఆ.. కూచిపూడి నృత్యం ఒకటి ముగ్గురు అమ్మాయిలు మూడు సార్లు మైకు దగ్గరకి వచ్చి, వెనక్కి వెళ్ళి ఆఖరికి అవకాశం వచ్చి మైకు లో నాలుగు ముక్కలు మాట్లాడి తరువాత చేసిన ఆ నృత్యం ఒకటి బాగుంది. దాదాపు పదిన్నర దాకా ఓపిక బట్టి, ఇంక చేతులెత్తేసాను ఆ రోజుకి!

* * *

Sunday, July 3 2005

ఈ రోజు మంచి ఆసక్తికరమైన కార్యక్రమాలు వున్నాయి. అన్నీ ముఖ్యమైనవే! దేనిలో వుండాలో తేల్చుకోలేని సమస్య! పొద్దుటే తొమ్మిదింటికి మొదలయ్యే సాహిత్య కార్యక్రమాల కోసం ఉరుకులూ పరుగులూ గా వెళ్తే అక్కడ ఇంకా ప్రసంగించే వారే రాలేదు! అక్కడ వున్న ఆరి సీతారామయ్య గారు, ఆరి ఉష గారు, కల్పనా రెంటాల గారు, అఫ్సర్ గారు మాత్రమే Socialization కార్యక్రమం లో వున్నారు. ఈ కార్యక్రమం లో ప్రసంగించే వక్తల కోసం పడిన పాట్లు, కొంత మంది attitude problems గురించి చెప్తున్న ఆరి గారు అడిగారు "ఏమండీ మీరే మన్నా తిన్నారా?" అని. ఇక్కడ కార్యక్రమానికి ఆలశ్యం అయిపోతోంది అని హడావిడిగా అక్కడ ఒకాయన (అదే మొదటి రోజు ఎలివేటర్ లో కనిపించిన ఆయన) వేదిక్ మేథమేటిక్స్ గురించి ఎంతో ఆసక్తికరంగా చెప్తున్నా మీతో తర్వాత మాట్లాడతానండి అని చెప్పి వచ్చేశాను" అని జవాబిచ్చాను.

"వేదాలు ఎక్కడకీ పోవు, ఇది ముఖ్యం, మాకు వున్న మొట్టమొదటి శ్రోత మీరు, వెళ్ళి ఒక అరగంట లో ఏదో ఒకటి తినేసి రండి ఈ లోగా ఏమీ అయిపోదు" అని నన్ను క్రిందకి పంపారు.

క్రింద రుచి వారి స్టాల్ లో "పెసరట్టు, ఉప్మా" సంతృప్తి గా ఆరగించి, మళ్ళీ పైకి చేరాను. ముందు పుస్తకావిష్కరణలు. ఆరి సీతారామయ్య గారి కథల సంపుటి "గట్టు తెగిన చెరువు" పుస్తకాన్ని శ్రీ వాసిరెడ్డి నవీన్ (ఈయన తనని భారత దేశం లో TANA వారి ప్రతినిధి అంటుంటారు అని స్వపరిచయం చేసుకున్నారు) గిడుగు రామ మూర్తి గారి మీద రాసిన పుస్తకం "మరోసారి గిడుగు"ని వారి కుటుంబం తో దగ్గరి సంబంధం వున్న పాలన గారు ఆవిష్కరించారు. ఆవిష్కరణ సమయం లో పాలన గారు గత స్మృతులని తలచుకొని కొంచెం ఎమోషనల్ అవుతూ తాను కొంచెం ఎమోషనల్ అని గుర్తు చేసారు. మూడో పుస్తకం వాసిరెడ్డి నవీన్ గారిది వుండాలిట. కానీ వారి పని ఒత్తిడి లో చేయాల్సిన పని సకాలం లో పూర్తి చేయలేకపోయినందుకు శిక్ష గా (ఆయనే వేసుకున్నారుట) తన పుస్తకాన్ని అచ్చు వేయించుకోలేదుట.

తరువాతి కార్యక్రమం మొదలెట్టబోతున్నంతలో ప్రొఫెసర్ BV పట్టాభిరామ్ గారు వచ్చి వారి CD లు కొన్ని విడుదల చేయించుకొని అక్కడి వారికి ఉచితముగా వాటిని పంపిణీ చేసి వెళ్ళిపోయారు. సరే తరువాతి కార్యక్రమం అనుకునేంతలో మరొకాయన తన పుస్తకం ఒక దానిని ఎవరో మినిస్టర్ గారి చేత విడుదల చేయించుకొని వాటిని కూడా అందరికీ పంచి వెళ్ళిపోయారు.

దాదాపు 45 నిమిషాలు ఆలస్యం గా ప్రవాసాంధ్రుల తెలుగు, సాహిత్యం మీద ప్రసంగాలు మొదలయ్యాయి. దీనికి అధ్యక్షులు కల్పనా రెంటాల గారు. ప్రసంగికులు వారి పతి దేవులు అఫ్సర్ గారు, ప్రొఫెసర్ భార్గవీ రావు గారు (వీరిని వేదిక మీదకి పిలుస్తుండగా అరుణ గారు వారి వృద్ధి కీ వివాహానికీ మధ్య సంబంధం గురించి ఏదో చెప్పారు కానీ జనాల నవ్వుల మధ్య అంతగా నాకు అర్థం కాలేదు.)

ఇంక కార్యక్రమం మొదలెడతారు అనగా వెనకాల వున్న శ్రీ లేచి అఫ్సర్ మీద తన విమర్శాస్త్రాలు సంధించటానికి అనుమతి కోరారు. కానీ ఆరి సీతారామయ్య గారు అఫ్సర్ గారి తరపున batting చేసి అన్ని ప్రశ్నలకీ తాను సమాధానం ఇవ్వగలనని చెప్పారు. ఆయనా ఇవ్వలేదు, అఫ్సర్ గారూ ఇవ్వలేదు (నేను వుండగా). మరి నేను లేనప్పుడు ఏమన్నా ఆ కార్యక్రమం జరిగిందేమో నాకు తెలియదు! ఇంతకీ విషయమేమిటంటే, ఈ మధ్య AP Weekly లో అఫ్సర్ గారు రాసిన ఏవో వ్యాఖ్యలు శ్రీ కీ, మరికొంత మందికీ నచ్చలేదు. అవి TANA, ATA వంటి సంస్థల గురించి చేసిన విమర్శలు (?) ఏది ఏమైనప్పటికీ అఫ్సర్ గారు, తర్వాత మాట్లాడిన భార్గవీ రావు గారూ ఇద్దరూ ఈ సంఘటనని పరోక్షంగా తమ ప్రసంగాలలో ప్రస్తావించి వూరుకున్నారు. అంతకన్నా చేయటం ఎందుకులే అనుకున్నట్టున్నారు!

అఫ్సర్ గారి ప్రసంగం లో ప్రస్తావించిన రుక్మిణి గారి రచన గురించి శ్రోతల్లోని వారికి కొన్ని అభ్యంతరాలు వున్నట్టు తోచింది. పక్కన వున్న జంపాల చౌదరి గారి ప్రోద్బలం తో మాచవరం మాధవ్ గారు ఏదో అడగబోయారు కానీ చెప్పాను కదా అఫ్సర్ గారి తరపున బ్యాటింగ్ లేక ఇంకా precise గా చెప్పాలంటే stand-by రన్నర్ గా అనిపించిన ఆరి సీతారామయ్యగారు ఈ bouncer లని కూడ void బాల్స్ చేసేసారు. ఏమిటీ stand-by runner అంటావ్, batting అంటావ్ అని విసుక్కుంటున్నారు కదూ ఇప్పుడు కొత్తగా రూల్స్ ఏవో మారాయండోయ్ వాటిని లెక్క లోకి తీసుకున్నా నేను అంటున్నదానికి ఎక్కడా అర్థం కనిపించకపోతే, క్రికెట్ లో నేను ఈకు అనుకొని, అదే, అంత మేతావు(వి) ని కాదు అని క్షమించేయండి!

తరువాత మాట్లాడిన భార్గవి రావు గారి ప్రసంగం నాకు చాలా నచ్చింది. ఆవిడ తనకి అఫ్సర్ గారి తరహాలో కోలాహలం రేకెత్తించాలని సరదాగా వున్నా ఇచ్చిన టాపిక్ అందుకు తోడ్పడే విధం గా లేదు అని కొంచెం complaint చేసి, "సాహిత్య వారధిగా అనువాదాలు - ఒక విశ్లేషణ" అనే విషయం మీద మాట్లాడారు. అనువాదాల ఆవశ్యకత, ఎటువంటి కథా వస్తువు ని అనువాదానికి ఎన్నుకోవాలి దానికి ముందు పరిశీలించవలసిన అంశాలు ఏమిటీ అని చక్కగా చెప్పారు.

చివరన మాట్లాడిన వారు వాసిరెడ్డి నవీన్. ఆయన కూడా కథ గురించి నన్ను మాట్లాడమంటే నేను ఒక రకం గా మాట్లాడే అవకాశం వచ్చి వుండేది, అయినా పర్లేదు లె, ఇదయినా OK అని చెప్పి "తెలుగు సాహిత్యానికి ప్రవాసాంధ్రుల ప్రోత్సాహం - భిన్న దృక్పథాలు" అనే అంశం మీద మాట్లాడారు. ఆయన చెప్పొచ్చేదేమంటే, వాళ్ళు చేస్తున్న మంచి పనుల విషయం మీద భిన్న దృక్పథాలు ఏమీ లేవు.. కొంచెం విరసం వాసనలు లేక అద్దాలు పెట్టుకున్న (ఈ మాట పక్కన కూర్చున్న జంపాల చౌదరి గారు రుక్మిణి గారి గురించి అంటుంటే, నిజమే కదా అని అనిపించి ఇక్కడ స్వేచ్ఛగా వాడేసుకుంటున్నా) రచయిత, రచయిత్రుల నుంచి తప్పితే అని! వరల్డ్ బాంక్, సామ్రాజ్యవాద దేశాల తీరులు, ఆంక్షల వలన ఆంధ్ర దేశం లో చిన్న రైతు (లేక గ్రామీణ జీవితం) చితికి పోయింది అని ఆయన తన ప్రసంగం లో అనగానే పాలన గారు గ్రీన్ రివల్యూషన్ తెచ్చింది మరి మేమే (లేక ఈ దేశాలే?) అని మర్చిపోయారా? అని నిలదీయబోయారు. లేదు నిజమే అన్నారు. "అక్కడ ప్రోజెక్ట్ లకి డబ్బులు ఇక్కడ నుండే వస్తున్నాయి అని మర్చిపోయారా" అంటే "లేదు నిజమే" అని ఒప్పుకుంటూనే, అక్కడి ఇవాల్టి దుస్థితి కి కూడా ఈ పరిస్థితులే కారణం అని కూడా చెప్పారు. ఆ విషయం అందరికీ తెలియనిదా? కానీ చాలా మంది, ముఖ్యం గా కమ్యూనిస్ట్ లనీ, వారి సిద్ధాంతాలనీ ఒప్పుకోని వారు లేదు, కాదు అని ఖండించాలని చూస్తారు.. ఎందుకో నాకు అర్థం కాదు! వాసిరెడ్డి నవీన్ తన ప్రసంగం అలా అలా సాగిస్తుంటే ఆరి గారు అయిదు వేళ్ళు చూపించేసరికి సరే అని చివర మాట గా ఆంధ్ర దేశం లో గ్రంథాలయాల ని సంస్కరించాలనీ, తెలుగు లోని ప్రముఖ రచనలని ఇక్కడి భాష తో ప్రావీణ్యం సంపాదించిన వారు అనువాదాలు చేయాలనీ కోరారు.

ఆ కార్యక్రమం అయ్యాక దానికి అధ్యక్షత వహించిన కల్పనా రెంటాల గారిని ఎవరో మీరు మంచి అధ్యక్షులు అని పొగడటం వినిపించింది. దానికి కారణం తరువాత కార్యక్రమం లో వుంది. కల్పన గారు నాతో తర్వాత చెప్పారు నేను మీ "అమ్మ పెళ్ళి" కథ గురించి నా వ్యాసం లో ప్రస్థావించాను సావనీర్ లో చూడండి అని. నాకు విమర్శలు అంటే భలే ఇష్టం. ఒక కొత్త దృక్పథం అని అనిపిస్తాయి అవి. పైగా "అమ్మ కథ" చదివి, రచయిత్రి గా నాకు శాపనార్థాలు పెట్టిన వాళ్ళు వున్నారు (కొంత మంది సన్నిహిత మిత్రులే!) "ఇలాంటి రాతల వలన మన సంస్కారం, సంస్కృతి ఎటు పోతున్నాయో అని సందేహం వస్తుంది" అంటూ. సరే, కల్పన గారు ఏమంటారో అని ఆసక్తి గా అడిగాను కానీ ఆమె పెద్దగా ఏమీ చెప్పలేదు.

మధ్యాహ్నం భోజనం ఒక్కదానినే చేసాను. తరువాత కార్యక్రమానికి సమయం మీరి పోతోంది అని హడావిడి గా ఏమి తింటున్నానో కూడా గమనించని విధం గా తిన్నాను. కానీ చుట్టూ కొంత మంది ఆ రోజు మరో చోట జరిగిన అవధానం గురించి మాట్లాడుకోవటం వినిపించింది. ఇక్కడా, అక్కడా అని పొద్దుట సమస్య వచ్చినప్పుడు, అవధానం చాలా సార్లే చూసాను, ఈ ప్రసంగాలు మళ్ళీ ఎప్పుడో కానీ వినే అవకాశం రాదు అని ఈ ప్రసంగాలకే వచ్చాను. అవధానం కూడా బాగుందిట. అక్కడ ఒకావిడ తన టీనేజ్ confused కుమార్తె (పేరు నిహారిక) తో అవధాని గారు నీ పేరు మీద పద్యం చెప్పారు అని ముచ్చటగా చెప్తే ఆ అమ్మాయి "what ever!" అని అనటం వినిపించింది.

మద్యాహ్నం కార్యక్రమం ముందు భూషణ్ గారు తన కథల సంపుటి "సముద్రం" అనే పుస్తకం ఇచ్చారు. దానిని తిరుగు ప్రయాణం లో flight లో ఏక ధాటీ గా చదివేసాను. చాలా నచ్చాయి అందులోని ఒకట్రెండు కథలు. కొన్ని కథలు నాలో ప్రశ్నలు రేకెత్తించాయి. అన్ని కథలూ అందరినీ సంతృప్తి పరచలేవు నాకయితే బానే నచ్చాయి. ఏమైనా ఆయన పద్యాలు పాడటం వినగానే, "ఏమండీ మీరు ఇలా సినిమాల్లో, వేరే వాళ్ళు రాసినా పద్యాలు చదవటమేనా మీ సొంతం అంటూ ఏమన్నా రాస్తారు కూడానా?" అని అడగటం గుర్తొచ్చి మరోసారి సిగ్గనిపించింది. పిల్ల పాములు కొత్తగా విషం వస్తున్న రోజుల్లో కనపడిన ప్రతీ దాన్నీ వెళ్ళీ కాటేసి సరదా తీర్చుకుంటాయిట. అలాగ ఈ సాహితీ వనం లో పెద్ద పెద్ద వారి ముందు అర కొర జ్ఞానం తో ఇలా అందరినీ కప్పించటం నాకు ఎప్పటికి పోతుందో!!

నేను భోజనం ముగించి ఇటు వైపు అదే, సాహిత్య కార్యక్రమాలు జరుగుతున్న వైపు తిన్నగా రాకుండా Farmer's Forum లోకి దూరాను. అక్కడ కార్యక్రమం ఒంటిగంట కి మొదలవాలి. "నీటి వనరుల సదుపయోగం", "రైతులు ఎదుర్కొంటున్న సమస్యల" గురించి ఆలపాటి రవీంద్ర, చెరుకూరి వీరయ్య, బండ్ల హనుమయ్య, రేణుకా చౌదరి, ఇంకా మిగిలిన రాజకీయ నాయకుల ప్రసంగాలు వున్నాయి ఆ కార్యక్రమం లో. కానీ రెండింటి వరకూ అక్కడ కూర్చున్నా అసలు ప్రసంగాలు చేసే వాళ్ళే రాలేదు. అక్కడి నిర్వాహకులు ఇంకొక్క పది, ఇంకొక్క అయిదూ నిమిషాలు అని వచ్చిన వాళ్ళని కుర్చీలో వుంచటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ లోగా అదే హాల్ లో సినీ తారల కార్యక్రమం ప్రకటించినట్టున్నారు. చాలా మంది వచ్చి "ఇంకా సినిమా వాళ్ళు రాలేదా?" అని అడిగి, అది సినిమా వాళ్ళు కాదు రాజకీయాల వాళ్ళు మాట్లాడే కార్యక్రమం అదీ, బోరింగ్ రైతుల గురించి అని తెల్సుకొని సినిమా వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. నేను కూడా చివరికి దాదపు రెండూ ఆ ప్రాంతం లో విసుగు వచ్చి, సాహిత్య కార్యక్రమం లో చూద్దాం అని బయలదేర బోతుండగా బయట టొరాంటో లో నాకు పరిచయం వున్న ఒకాయన కనిపించారు. ఆయనతో కొద్దిగా మాట్లాడి, మొత్తానికి నేను కూడా సినిమా వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళే గ్రూపు లో చేరి పోయాను. అక్కడ హాల్ పూర్తిగా నిండిపోయింది. బయట నిర్వాహకులు లోపల ఖాళీ లేదండీ బాబూ అని మొత్తుకుంటున్నా వాళ్ళని తోసుకుంటూ జనాలు దూరి పోతున్నారు. నన్ను నా వెనుక వున్న వాళ్ళు లోపలికి తోసారు, నేను తోసుకుంటూ వెళ్ళలేదు అంటే నమ్ముతారా?!

లోపల వేదిక మీద పరుచూరి బ్రదర్స్ మాట్లాడుతున్నారు. వారు అక్కడ ఆంధ్ర దేశం లో పల్లెల్లో వున్న వాళ్ళు తమ ఇక్కడ వారి కన్నా ఎక్కువ ఇంగ్లీషు తమ రోజూ భాష లో వాడుతున్నారు అని శలవిచ్చారు. ప్రేక్షకులలో ఒకరు "ఇంతకీ మిమ్మల్ని పరుచూరి సోదరులు అనాలా లేక పరుచూరి బ్రదర్స్ అనాలా" అని సందేహం వెలబుచ్చితే, "పరుచూరి బ్రదర్స్ అనేది మా తెర మీద వేసే పేరు. దానిని మాకు ఇచ్చినది స్వర్గీయ NT రామారావు గారు. విడిగా మమ్మల్ని సోదరులు అనే పిలవండి" అన్నారు. అనూరాధ, ఆమె కుమార్తె అభినయశ్రీ లని "సినిమాలకి వచ్చేటప్పుడు, రావటానికి తల్లీ కూతుర్లకి వున్న పరిస్థితులూ, కారణాల గురించి చెప్పమని అడిగారు. అనూరాధ తన కుటుంబ పరిస్థితులూ, కుటుంబం లో వారందరూ సినిమాలలో వుండటం వలన వచ్చాను అని చెప్పారు. తన కుమార్తె మాత్రం పదమూడు సంవత్సరాలకే తన నృత్యాలని అభినయించటం చూసి, ఆసక్తి వుందని గ్రహించి పద్దెనిమిది ఏళ్ళు వచ్చే వరకూ ఆగు అని చెప్పాను అన్నారు. అదే ప్రశ్నకి జవాబు ఇవ్వమని అభినయశ్రీ ని అడిగితే ఆమె ఈనాటి టిపికల్ టీనేజర్ లాగ "తను చెప్పారు కదా, మళ్ళీ నేను ఎందుకూ?" అని అడిగి, అంతా లేదు చెప్పు అని అడిగేసరికి తన

ఉద్దేశం చెప్పారు. ఆమె చెప్పొచ్చేది, తల్లి అంత పేరు ప్రఖ్యాతులు లేక అపి నిలబెట్టే పేరు తెచ్చుకుంటాను అని! తరువాతి ప్రశ్న సంగీత దర్శకులు RP పట్నాయక్ గారికి. నేను చివరకి వుండిపోయాను కానీ లేకపోతే "అసలు మీరు ఎందుకు పాడతారు?" అని అడుగుదాము అనుకున్నాను. మా మహేష్ చిత్రం "నిజం" ఇంకా పచ్చి నిజం లా నా గుండెని మండిస్తోంది మరి! కానీ ఎవరో కొంచెం అదే ప్రశ్న అడిగారు. దానికి ఆయన ఇచ్చిన సమాధానం "నేను సమయాభావం వలన వేరే వాళ్ళ కోసం ఎదురుచూడకుండా ట్రాక్స్ పాడేస్తూ వుంటాను, అవే నచ్చి ప్రొడ్యూసర్లూ దర్శకులూ ఇంక సినిమాల్లో కూడా వుంచేస్తారు తప్ప, ఈ పాట నేను మాత్రమే పాడాలి అనే వుద్దేశం నాకు ఏనాడూ లేదు. సంతోషం లో నాగార్జున కి నా స్వరం సరిపోదు కనుక నేను ఆ చిత్రాన్ని క్షమించేసాను (ఆయన ఇలా చెప్పలేదు అనుకోండి) " అని చెప్పారు.

చాల్లే అనిపించి, అక్కడ నుండి బయటకి వచ్చేసాను. సాహిత్య కార్యక్రమాలలో ప్రస్తుతం జరుగుతున్నది "తెలుగు సాహిత్యం లో గ్రామీణ జీవితం" గురించి ఉపన్యాసాలు.

నేను వచ్చేసరికి "గిడుగు అవార్డ్ లెక్చర్" జరుగుతోంది. దీనిని ఇస్తున్న వారు ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణ మూర్తి గారు. ప్రసంగం చివరి భాగం మాత్రమే విన్నాను. చాలా ఆసక్తికరం గా వున్నట్టు అనిపించింది. శ్రోతలకి కూడా ఆయన ప్రసంగం చాలా నచ్చినట్టు వుంది.

తరువాత కార్యక్రమానికి అధ్యక్షులు నాగెళ్ళ గురుప్రసాద రావు గారు. ఆయన వక్తల కన్నా ఎక్కువ సమయం మాట్లాడారు. ప్రేక్షకులు కొంచెం అసహనం గా సీట్లలో కదలటం గమనించి మొదటి వక్త ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే గారికి మైకు ఇచ్చారు (సమయం లేదు, త్వరగా కానీయాలి అని సూచన తో). ఆవిడ ప్రసంగం మొదలయేసరికి నాకు కాఫీ టైము అయింది. అది తెచ్చుకొని వచ్చేసరికి ప్రసంగం అయిపోయింది. ఆ విధం గా ఆవిడ ప్రసంగం మిస్ అయ్యాను. రెండవది కాట్రగడ్డ దయానంద్ గారు. "గ్లోబలైజేషన్ - గ్రామీణ జీవితం" మీద తను రాసుకొని వచ్చిన ప్రసంగం ని చదివారు. కొన్ని హృదయానికి హత్తుకొనే కథల గురించి ఆయన ప్రస్తావించారు. మొత్తం మీద ఆయన ప్రసంగం నాకు ఆసక్తి కరం గా అనిపించింది. మూడో వక్త విరసం తో సన్నిహిత సంబంధాలు వుండిన వెంకటయోగి నారాయణస్వామి గారు. దయానంద్ గారి టాపిక్కే కాకపోతే ఈయన మాట్లాడేది కవిత గురించి. పక్కా విరసం సభ్యుడి మాదిరి గ్లోబలైజేషన్ మీద నిప్పులు చెరిగారు, అసువులు బాసిన వారిని తలచుకొని కొద్ది సార్లు మూగవోయారు, ఆవేశం వచ్చినప్పుడు కవితలకి బాణీ కట్టి పాట లాగ పాడారు మొత్తానికి నాకు ఒకసారి కళ్ళలో నీళ్ళు తెప్పించారు.

అక్కడ ప్రసంగాలు అయ్యాక అందరి దగ్గరా శలవు పుచ్చుకొని, క్రిందకి exhibit area కి వచ్చాను. అక్కడ మరి కొన్ని DVD లు, పుస్తకాలూ తీసుకొని కాఫీ తాగి, అక్కడే కనపడిన నాగరాజు గారు, వారి జూనియర్ మరియూ శ్రీమతి దమయంతి గార్లతో అతుక్కుపోయాను. ఏవో కబుర్లు చెప్పుకుంటూ TANA Grand Finale అని COBO Arena లోకి నడిచాము. అక్కడ సౌండ్ సిస్టం భయంకరం. దగ్గర కూర్చుంటే చెవులు గింగురులూ, దూరం కూర్చుంటే ఎకో! ఏవో ప్రసంగాలు అవుతున్నాయి. ప్రతీవాళ్ళూ మళ్ళీ అవకాశం రాదేమో అన్నట్టు (అంతే కదా, మళ్ళీ రెండేళ్ళ దాకా అవకాశం రాదు కదా!) మైకులు పట్టుకొని వదలరే! అక్కడకీ ప్రేక్షకులు వెళ్ళిపొమ్మని కూతలు కూయటం, చప్పట్లు కొట్టడం చేసినా అదేదో తమని ప్రోత్సహిస్తున్నారు అనుకోవటం! ముఖ్యం గా నేదురుమల్లి రాజ్యలక్ష్మి గారు చప్పట్ల హోరు లో తన ప్రసంగం ఎక్కడ

జనాలకి చేరదో అన్నట్టు స్వరాన్ని పెంచటం భలే నవ్వు తెప్పించింది.

నాది కొంచెం stone అదే, స్వరం కొంచెం కంచు కంఠం లాంటిది. నేను వక్తల గురించి చేస్తున్న కామెంట్లు మా ముందు కూర్చున్న ఒకావిడకి ఒళ్ళు మండి "నోరు ముయ్యేవే" అని కసిరారు. కొంచెం సిగ్గు లాంటిది వేసింది తరువాత కొంచెం తక్కువ మాట్లాడటానికి ప్రయత్నించాను కానీ మాట్లాడకపోవటం నాకు ఇంతవరకూ అలవాటు కాలేదు. చివరికి ఆమె విసుగొచ్చి నాకు దూరంగా సీట్ మారి పోయారు. నేనెప్పుడు మితబాషిణి అనిపించుకుంటానో!

ఆకలి అనిపించి డిన్నర్ కి నేను, భూషణ్, నాగరాజు గారు బయలుదేరాము. అక్కడ భోజనం పెద్ద పసందుగా అనిపించలేదు. కానీ, మా టేబుల్ మీద మా పక్కన వున్న ఒకావిడ మాతో మాటలు కలిపారు. ఆవిడదీ మా కెనడానేట! తరువాత జరిగిన సంగీత విభావరి లో గాయనీ గాయకులు ఏమన్నా బాగా పాడారో లేదో తెలీదు కానీ, సౌండ్ సిస్టం వలన తలనొప్పి, నిద్రా వచ్చి ఎప్పుడు సీట్లో కూర్చుని నిద్ర లోకి జారుకున్నానో తెలీదు. దమయంతి నిద్ర లేపారు, మేము బయలుదేరుతున్నాం అని. వాళ్ళ దగ్గర శలవు తీసుకొని, బయట కనపడిన ఆరి సీతారామయ్య గారి ఆటోగ్రాఫ్ ఆయన పుస్తకం లో తీసుకొని, హోటల్ చేరుకున్నాను.

* * *

TANA సావనీర్ లో నాకు పరిచయస్థులు చాలా మంది కథలు, కవితలు, వ్యాసాలు కనిపించాయి. అవన్నీ కొద్ది రోజులు కాలక్షేపం. వాటిని చదువుకుంటూ, దాదాపు చాలా మందిని ప్రత్యక్షం గా కలిసాను కనుక బాగా enjoy చెయ్యగలను అనే అనుకుంటున్నాను. చూడండి తాయిలం అని చేతిలో పెట్టిన చిన్న స్వీట్ ముక్క ని గుటుక్కున నోట్లో వేసేసుకోవటం నాకు నచ్చదు. కొద్ది కొద్దిగా చప్పరిస్తూ సాధ్యమైనంత సేపు తినటం నచ్చుతుంది. ఆ విధం గా ఈ సావనీర్ నీ, తెలుగు నాడి మూడు సంచికలూ (నేను membership ఎంత అని అడిగితే, జంపాల గారు ఆ పుస్తకాలని కెనడా కి పోస్ట్ చేయటం లో వున్న ఇబ్బందుల గురించి చెప్పారు) వంశీ సిని మాలా, ఆరి గారి పుస్తకం, కథ - 2003, కథ - 2002 లని నెమ్మదిగా చదవాలి. మరో విషయం, చిన్నప్పుడు అమ్మ వేసిన బొమ్మలతో పాటు బాపూ గారివీ, చంద్ర గారు వేసినవీ ప్రాక్టీస్ చేయటం అలవాటు. అలాంటిది TANA సావనీర్ లో ప్రచురితమైన నా కథ కి చంద్ర గారు బొమ్మ వేయటం చూడగానే చెప్పలేనంత థ్రిల్లింగ్ గా అనిపించింది.

మర్నాడు పొద్దుట నా cab కోసం ఎదురుచూస్తూ ఆలోచించాను. నాకు ఈ సమావేశాలకి వచ్చినందుకు సంతృప్తిగా వుందా లేదా అని. నచ్చింది అనే చెప్పాలి. నేను కొంచెం కూపస్థ మండూకం లాంటి దాన్ని. అందులోనూ ఇప్పుడు అట్టావా నగరం వచ్చాక అసలు తెలుగు వాళ్ళు లేక మరీ విసుగు వస్తూ వుంటుంది. ఇలాంటి సమావేశాలకి వెళ్తే అన్నా కొంచెం నలుగురూ తెలుస్తారు. మరి మరోసారి ఇలాంటి అవకాశం వస్తే వెళ్తానా? ఖచ్చితంగా!

---

మీ సూచనలు, సలహాలూ రచయిత్రి SKU కి తెలియచేయండి.